


# కరపత్రం

SINCE 2014


ఆదివారం ఏప్రిల్ 26, 2026 | సంపుటి : 2 | సంచిక : 195 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4





## తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1

### జెండా ఊపి ప్రారంభించిన సిఎం రేవంత్



హైదరాబాద్,ఏప్రిల్25 :
హైదరాబాద్ స్కైరూట్ ఏరోస్పేస్ వేదికగా దేశపు తొలి ప్రైవేటు ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1 ప్రయాణం మొదలు కానుంది. ఇందులో భాగంగా మ్యాక్స్-క్యూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, పలువురు అధికారులు హాజరయ్యారు. శ్రీహరి కోటకు పంపనున్న రాకెట్ విక్రమ్-1ను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. ప్రీ ఫైలట్ పరీక్షలన్నింటినీ పూర్తి చేసుకొని తదుపరి ప్రయోగం కోసం.. సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌కు ఇది చేరుకోనుంది. ఇండియాలోనే తొలి ప్రైవేట్ రాకెట్ గా రికార్డుకెక్కిన విక్రమ 1 రాకెట్ ను ఫ్లాగ్ ఆఫ్ చేసి శ్రీహరి కోటకు పంపారు సీఎం రేవంత్ రెడ్డి. 2026 ఏప్రిల్ 25న శంషాబాద్ ఏరోస్పేస్ పార్క్‌లోని స్కైరూట్ సంస్థను సందర్శించారు సీఎం. ఆ సంస్థ తయారు చేసిన భారత తొలి ప్రైవేట్ కమర్షియల్ రాకెట్ విక్రమ్-1 గురించి తెలుసుకున్నారు. స్కైరూట్ సంస్థలో రాకెట్ తయారీ, టెక్నాలజీ తదితర అంశాల గురించి చర్చించారు. తొలి ప్రైవేట్ రాకెట్ తయారు చేసిన సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. రాకెట్ ను శ్రీహరికోట లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి లాంచ్ చేయనున్నారు. దీంతో సీఎం రేవంత్ జెండా ఊపి శ్రీహరి కోటకు పంపారు. హైదరాబాద్‌కు చెందిన స్పేస్‌టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్-1 భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ కమర్షియల్ ఆర్బిటల్ రాకెట్. 2025 నవంబర్‌లో ఈ రాకెట్ ను ఆవిష్కరించారు. 480 కిలోల బరువున్న ఉపగ్రహాలను తక్కువ భూ కక్ష్యలోకి తీసుకెళ్లగలదు దీనిని పూర్తిగా కార్బన్ ఫైబర్‌తో నిర్మించడం విశేషం. ఇది 3ఆ ప్రింటెడ్ ఇంజన్‌లను కలిగి ఉండి.. పూర్తిగా కార్బన్-్గ÷బైర్ బాడీ రాకెట్. కార్బన్్గ ÷బైర్ వాడటం వలన ఇది తేలికగా, బలంగా ఉంటుంది. సుమారు 300 - 480 కిలోల బరువున్న ఉపగ్రహాలను 500 కిలోమీటర్ల లో ఎర్త్ ఆర్బిట్ లోకి ప్రవేశపెట్టగలదు. 2026 లో త్వరలో అంతరిక్షంలోకి వెళ్లనుంది. భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ పేరు మీద ఈ రాకెట్‌కు 'విక్రమ్-1' అని పేరు పెట్టారు. ఇది పూర్తి స్వదేశీ సాంకేతికత తో, 100శాతం భారతదేశంలోనే తయారైంది.

## కవిత కొత్త పార్టీ.. 'తెలంగాణ రాష్ట్ర సేన'

» బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు
» "కేసీఆర్ మారిన మనిషి.. మర మనిషి" వ్యాఖ్య
» బీఆర్ఎస్ ఆత్మ కోల్పోయిందని ఆరోపణ
» కాంగ్రెస్ పాలనపై కూడా విమర్శలు
» బీజేపీ తెలంగాణకు వ్యతిరేకమని ఆరోపణ



హైదరాబాద్:
తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భవించింది. కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ సభలో పార్టీ పేరును కవిత ప్రకటించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. తెలంగాణ కోసం అనేక కష్టాలు పడి.. పిడికిలి బిగించి కొట్లాడామన్నారు. జాగృతి కార్యకర్తలు తెలంగాణ సాంస్కృతిక దీపాన్ని పదిలంగా కాపాడుకున్నారని చెప్పారు. "కాళరాత్రిలో కాగడా వలే తెలంగాణ ఉద్యమకారులకు తెలంగాణ జాగృతి వెలుగునిచ్చింది. తెలంగాణ సమాజానికి కాంతిరేఖగా మారింది. మరోసారి బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసుకున్నాం. ఏ కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో అవి నిజం కాలేదు. ఇవాళ నా జీవితంలో మరిచిపోలేని రోజు అవుతుంది. తెలంగాణ భవిష్యత్ రాసుకోవడానికి మనందరి భాగస్వామ్యం కావాలి. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఉద్యమ రథం దారి తప్పింది. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రజల ఆర్తిని అర్థం చేసుకోలేకపోయింది. సామాజిక తెలంగాణ రథ చక్రం విరిగి ముక్కలైంది. కొత్త రాష్ట్రంలో జరగాల్సిన పనులు సరిగా జరగలేదు. తెలంగాణ వస్తే బానిస సంకెళ్లు పోతాయని భావించాం. కానీ, రైతులకు బేడీలు పడ్డాయి.. ఇసుక దందా వల్ల దళితులు దెబ్బలు తిన్నారు

**పని చేయడం కోసమే టీఆర్ఎస్**

ఫోన్లు ఎక్కడ వింటున్నారోనని భయం.. వ్యక్తిగత స్వేచ్ఛ లేదు. దారుణమైన నిఘా నీడలో తెలంగాణ అంతా బతికింది. మనం అనుకున్న తెలంగాణ రాలేదనేది ముమ్మాటికీ వాస్తవం. ఆనాడు పరిపాలించిన కుటుంబంలో నేను కూడా ఒక భాగం. అందుకే కొన్ని విషయాల్లో సిగ్గుపడుతున్నా. తెలంగాణ ప్రజలను క్షమించాలని కోరుతున్నా.

2లో..

## కవిత పార్టీతో ఒరిగేదేమీ లేదు

» తెలంగాణలో వచ్చేదే బిజపియే
» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు


2లో..

హైదరాబాద్,ఏప్రిల్25 :
కల్వకుంట్ల కవిత నేడు తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పేరు ప్రకటించారు. ఇక కవిత కొత్త పార్టీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారని గుర్తు చేశారు. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తుంది.. అనేది ప్రజలు ఆలోచించాలని పిలుపు నిచ్చారు. 12 ఏళ్ల పాలనలో నరేంద్ర మోడీ అవినీతి రహిత పాలన అందించారని చెప్పారు. 'గతంలో టీఆర్ఎస్.. ఇప్పుడు బీఆర్ఎస్ పుట్టబోయే బిడ్డ పేరు టీఆర్ఎస్ అంటా.. ఎన్ని పార్టీలు వచ్చినా.. ఎన్ని పార్టీలు ఉన్నా బీజేపీకి ఇబ్బంది లేదు.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు.

## అస్వస్థకు గురైన గవర్నర్ నజీర్

- మణిపాల్ ఆస్పత్రిలో పరీక్షలు..డిశ్చార్జ్
- విషయం తెలిసి లోక్‌భవన్‌కు వెళ్లి బాబు పరామర్శ

విజయవాడ,ఏప్రిల్25 :
ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అస్వస్థతకు గురయ్యారు. కడుపులో తీవ్ర నొప్పి రావడంతో ఆయనను విజయవాడలోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు.


మిగతాది 2లో

## మరో 47మంది అజ్ఞాత మావోల లొంగుబాటు



- గణపతి తదితరులు ఇంకా అజ్ఞతంలోనే ఉన్నారు
- తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,ఏప్రిల్25:
తెలంగాణలో మావోయిస్టు ఉద్యమం అంతిమదశకు చేరుకోవడంతో మిగిలిన వారు కూడా లొంగుబాట పట్టారు. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మొత్తం 47 మంది అజ్ఞాత మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో చేరారు.

2 లో

## బిఆర్ఎస్ ఉండి అవినీతిలో భాగస్వామ్యం

- ఇప్పుడు నీతి పలుకులు పలికితే ప్రజలు నమ్మరు
- సిఎం రేవంత్‌ను విమర్శిస్తే ఓట్లు రాలవు
- కవిత పార్టీపై ఎంపి చామల విమర్శలు


2లో

హైదరాబాద్హైదరాబాద్,ఏప్రిల్25 :
బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే కవిత బయటకు వచ్చి పార్టీ పెట్టి ఉంటే ప్రజల్లో మంచి ఆదరణ వచ్చేదని కాంగ్రెస్ భువనగిరి లోక్‌సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు. అధికారంలో ఉండగా అవినీతిలో భాగస్వామ్యం అయిన కవిత ఇప్పుడు పార్టీ పెట్టి ప్రజలను ఎలా నమ్మిస్తామని అనుకుంటున్నారని ప్రశ్నించారు. కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై ఎంపి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పెట్టినందుకు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. అమ్మగా జేబులు చూసి కాదని.. కడుపు చూసి పాలిస్తానని కవిత చెప్పారని ప్రస్తావించారు. శనివారం హైదరాబాద్ లో కిరణ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు జేబులు చూసి పరిపాలించారని కవిత చెప్పారని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో గతంలో టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశారని ప్రస్తావించారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణను కేసీఆర్ హయాంలో దోపిడీ చేశారని ఎంపీ చామల ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలోని పదేళ్లు కవిత ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.


2 లో

## తండ్రి పిట్టల దొర.. బిడ్డ పిట్టల దొరసాని

» కవితకు రాజకీయ సమాధి కట్టిందే బిజెపి
» మీడియా సమావేశంలో నిజామాబాద్ ఎంపి అర్వింద్

హైదరాబాద్,ఏప్రిల్25 :
సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే.. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని కాదని బీజేపీని గెలిపించారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పిట్టల దొరను చూశారని.. ఇప్పుడు పిట్టల దొరసానిని చూస్తారని వ్యంగ్యంగా విమర్శించారు. కవితకు బీజేపీ రాజకీయ సమాధి కట్టిందని గుర్తు చేశారు. శనివారం కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పేరు ప్రకటించారు. ఈ సందర్భంగా కవిత పలు వ్యాఖ్యలు చేశారు.

## అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం

» ఎన్నికల హామీలు నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నాం
» మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి
» 27 న రెవెన్యూ,హౌసింగ్ అంశాలపై మంత్రి సమీక్షలు
» ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా సమావేశాలు


2లో..

హైదరాబాద్,ఏప్రిల్25 :
బీఆర్ఎస్ పాలనలో అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తూ ముందుకు వెళ్తున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పథకాలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## మహిళ విద్యా,ఉపాధిపై ప్రభుత్వం దృష్టి



- లాభదాయక వ్యాపారాలపై దృష్టి సారించాలి
- టీనేజ్ బాలికల కోసం స్నేహా సమ్మర్ ప్రోగ్రామ్
- మంత్రి సీతక్క వెల్లడి

హైదరాబాద్,ఏప్రిల్25 :
మహిళల విద్య, ఉపాధిపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం ఏప్రిల్ 26, 2026

# కవిత కొత్త పార్టీ.. 'తెలంగాణ రాష్ట్ర సేన'

మొదటి పేజీ తరువాయి
తెలంగాణ సాధించినందుకు చాలా గర్వపడుతున్నా. జన్మధన్యమైందని భావిస్తున్నా. కానీ, తప్పులో నాకూ భాగం ఉన్నందుకు క్షమాపణ చెబితే సరిపోదు. సామాజిక తెలంగాణ కోసం నడుం బిగించి కష్టపడి పని చేయాలి. పని చేయడం కోసమే తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) ప్రజల ముందుకు వచ్చింది. మా పని తీరు ఎలా ఉంటుందో ప్రజలు చూస్తారు. ప్రజలకు మంచి చేయాలంటే పోరాడితే సరిపోదు.. రాజకీయ అధికారం ఉండాలి. అది తోడైతేనే ప్రజలకు మంచి చేయగలం. ఏ పార్టీకైనా ఆత్మ, నేపథ్యం ఉండాలి. బీఆర్ఎస్ సాంకేతికంగా ఉన్నా ఆత్మను కోల్పోయింది. బీఆర్ఎస్ ఆత్మ కోల్పోయినందుకే తెలంగాణ రాష్ట్ర సేన వచ్చింది.

### కేసీఆర్ మన మనిషి కాదు.. మర మనిషి

నాటి టీఆర్ఎస్ కోసం నా రక్తం, చెమట, సమయం ధారపోశా. పార్టీ బలోపేతం కోసం పని చేశా. ఆనాటి కేసీఆర్ వేరు.. ఇప్పటి కేసీఆర్ వేరు. చేనేత కార్మికులు చనిపోతుంటే.. ఆనాటి కేసీఆర్ భిక్షాటన చేశారు. ఇవాళ్టి కేసీఆర్ మారిన మనిషి.. మర మనిషి.. మన మనిషి కాదు. ఎక్కడ చిన్న కష్టం వచ్చినా ఆ సార్ రారు.. ఎందుకంటే ఆయన మారిన మనిషి. గుంటనక్కలు, తోడేళ్ల చేతిలో కేసీఆర్ ఖైదీ అయ్యారు. పంజాబ్, గుజరాత్, బిహార్ వెళ్లి జాతీయ పార్టీ పెట్టాలని చూశారు. కేంద్రంతో గొడవ పెట్టుకోకుండా ఉండి ఉంటే పాలమూరు పూర్తయ్యేది. నేను ఎన్ని మాట్లాడినా బీఆర్ఎస్ నేతలు బయటకు వచ్చి జవాబివ్వట్లేదు. సమాధానం చెప్పకపోతే.. ప్రజలే బయటకు లాగి జవాబు చెప్పేలా చేస్తారు.

### అమ్మగా పరిణతి చెందుతా

తెలంగాణలోని 3.5 కోట్ల మందికి అమ్మగా పరిణతి చెందాలనుకుంటున్నా. అమ్మతనంతో పాలన చేస్తేనే బిడ్డలకు కష్టం వస్తే తీరుస్తుంది. తెలంగాణలో ఏళ్ల తరబడి భూస్వామ్య వ్యవస్థ నడిచింది. ఎందరో మహనీయులు పోరాడితే కొంత సమానత్వం వచ్చింది. మలిదశ ఉద్యమంలో కేసీఆర్, ఉద్యమకారులు పోరాడితే కొత్త రాష్ట్రం వచ్చింది. రాజకీయ శక్తితో పోరాటాలు మిళితం చేసి సామాజిక న్యాయ తెలంగాణ సాధిస్తాం. భాజపాకి రాష్ట్ర ఏర్పాటే ఇష్టం లేదు. 'తల్లిని చంపారు.. పిల్లను బతికించారని' ఒకరు అన్నారు. భారత్, పాక్ విడదీసినట్లు తెలుగు రాష్ట్రాలను విభజించారని మరో ఎంపీ చెప్పారు. అయినా, భాజపా బానిస ఎంపీలు ఒక్క మాట మాట్లాడలేదు.

### భాజపా ఎంపీలకు సవాల్

తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే భాజపా ఎంపీలు మాట్లాడరు. విభజన హామీలు నెరవేర్చకపోతే భాజపా ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి భాజపా. తెలంగాణ భాజపా ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలి" అని కవిత అన్నారు.

## కవిత పార్టీతో ఒరిగేదేమీ లేదు

మొదటి పేజీ తరువాయి
ఇదిలా ఉండగా.. టీఆర్ఎస్ అధినేత్రి కవిత పార్టీ ఆవిర్భావ సభలో బీజేపీపై ఫైర్ అయ్యారు. తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే బీజేపీ ఎంపీలు మాట్లాడటం లేదన్నారు. 'విభజన హామీలు నెరవేర్చకపోతే బీజేపీ ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి బీజేపీ. తెలంగాణ బీజేపీ ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలని కవిత పేర్కొన్నారు. బిజెపి ప్రజలకోసం పనిచేసే పార్టీ అని రామచంద్రరావు అన్నారు. పార్టీకి కేబర్, లీడర్ ఉన్న పార్టీ అన్నారు. కవిత పార్టీతో తెలంగాణకు ఒరిగేదేమీ

## మరో 47మంది అజ్ఞాత మావోల లొంగుబాటు

మొదటి పేజీ తరువాయి
లొంగిపోయిన వారిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, అలాగే దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీకి చెందిన కీలక నేతలు ఉన్నారు. ముఖ్యంగా హేమ్లా ఇతు (అలియాస్ విజ్జా), పోడియం లచ్చు (అలియాస్ మనోజ్) వంటి నాయకులు ఈ జాబితాలో ఉన్నారని డీజీపీ తెలిపారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు భారీగా ఆయుధాలు కూడా అప్పగించారు. మొత్తం 32 ఆయుధాలు, అలాగే 515 తూటాలు పోలీసులకు సమర్పించినట్లు డీజీపీ వెల్లడించారు. వీటిలో ఎకె-47, పలు రకాల రైఫిల్స్‌తో పాటు పిస్టల్స్, రివాల్వర్, మస్కెట్ గన్స్ వంటి వివిధ రకాల ఆయుధాలు ఉన్నాయి.తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస విధానం కారణంగా ఈ మావోయిస్టు కేడర్లు లొంగుబాటుకు ముందుకొచ్చారని చెప్పారు. దక్షిణ బస్తర్ డివిజన్ ప్రస్తుతం పూర్తిగా నిర్వీర్య స్థితికి చేరిందని కూడా డీజీపీ వ్యాఖ్యానించారు. లొంగిపోయిన వారిలో ఖఉఉం బెటాలియన్‌కు చెందిన 4 మంది, ఆఱఃూజిఅకు చెందిన 28 మంది, అలాగే 9వ, 30వ ప్లాటూన్‌లకు చెందిన 15 మంది ఉన్నారని వివరించారు. ఇక తెలంగాణకు చెందిన కొంతమంది కీలక మావోయిస్టు నాయకులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. వారిలో లక్ష్మణరావు (గణపతి), పసునూరి నరహరి (సంతోషం), జాడి రత్నాభాయ్ (సుజాత), వార్త శేఖర్ (మంగు) ఉన్నారని పేర్కొన్నారు. వీరిని కూడా లొంగిపోవాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు ఉద్యమంపై తెలంగాణలో భద్రతా బలగాల చర్యలు మరింత ప్రభావం చూపుతున్నాయని డీజీపీ తెలిపారు. నజీవన స్రవంతిలో చేరి తెలంగాణ ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం ద్వారా లభించే అన్ని ప్రయోజనాలను పొందాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. గత రెండేళ్లలో తెలంగాణ పోలీసుల సమర్థవంతమైన పనితీరు వల్ల మొత్తం 818 మంది మావోయిస్టులు లొంగిపోగా, వారి నుంచి 334 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న మెరుగైన పునరావాస ప్యాకేజీలు, పోలీసులు సాగిస్తున్న అవగాహన కార్యక్రమాల వల్ల అడవి బాట పట్టిన వారు తిరిగి ఇంటికి చేరుకుంటున్నారని చెప్పుకొచ్చారు. ఈ భారీ లొంగుబాటుతో రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావం మరింత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

## బిఆర్ఎస్ ఉండి అవినీతిలో భాగస్వామ్యం

మొదటి పేజీ తరువాయి
పంచుకునే వాటాల్లో తేడాలు వచ్చి ఆమె బయటకు వచ్చారని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని అన్నారు. కవిత ఇప్పుడు బయటకు వచ్చి సీఎం, సీఎం అని నినాదాలు చేయించుకుంటున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిని కర్కోటకుడు, హిట్లర్ అంటే కవితకు మార్కులు పడవని ఆక్షేపించారు. రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ, ఫ్యూచర్ సిటీ, ఉద్యోగాలు, మూసీ ప్రక్షాళన చేస్తున్నందుకు కర్కోటకుడు అయ్యారా...? అని ఫైర్ అయ్యారు. కవిత పార్టీ పెట్టుకోవచ్చని, పోరాటం చేయొచ్చని, ప్రజల్లోకి వెళ్లవచ్చని తెలిపారు. తెలంగాణను దోచుకోవడానికే ఆమె సీఎం కావాలని అంటున్నారా..? అని నిలదీశారు. కవిత నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తే స్వాగతిస్తామని తెలిపారు. ఆమె తెల్లకాగితం కాదని.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంపీగా, ఎమ్మెల్సీగా పని చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలను కవిత తప్పుదోవ పట్టిస్తున్నారని.. తెలంగాణ ప్రజలు ఆమెను నమ్మరని కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు.

## అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం

మొదటి పేజీ తరువాయి
ప్రతిపక్షం చేస్తున్న అసత్య ఆరోపణలను లెక్కచేయకుండా, పేదవాడే ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వివరించారు. భూములకు సంబంధించిన సమస్యలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పొంగులేటి తెలిపారు. వచ్చే 50 రోజుల్లో సాదాబైనామా అంశాల్లో న్యాయమైన సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు న్యాయం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం నుండి క్షేత్రస్థాయి సమీక్షలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు హిమాయత్‌నగర్ లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మధ్యాహ్నం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించి ఇటువంటి సమావేశాలను దశలవారీగా నిర్వహించనున్నారు. రాష్ట్రంలో తొలి విడతగా మూడున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు. సుమారు లక్షకు పైగా ఇళ్ళు గృహ ప్రవేశాలకు సిద్ధమైన నేపథ్యంలో మంత్రి గారు నిర్వహించే ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పూర్తి, కేటాయింపు, మౌలిక వసతుల కల్పన వంటి విషయాలను కూడా చర్చించనున్నారు. అంతేగాక త్వరలో రెండవ విడత ఇళ్ల మంజూరుకు సంబంధించి కూడా ఈ సమావేశంలో చర్చించే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా భూ వివాదాలు, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ,తాజాగా అమలు చేస్తున్న భూధార్ , సర్వేమ్యాప్‌ల వంటి కీలక రెవెన్యూ అంశాలపై జిల్లా అధికారులతో మంత్రి చర్చించనున్నారు. ఈ సమావేశంలో ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారు. అలాగే జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా హౌసింగ్ అధికారులు పాల్గొననున్నారు.

## మహిళ విద్యా,ఉపాధిపై ప్రభుత్వం దృష్టి

మొదటి పేజీ తరువాయి
మహిళల ఆర్థికాభివృద్ధికి క్రమశిక్షణ, లాభదాయక వ్యాపారాలపై దృష్టి పెట్టాలని సూచించారు. టీనేజ్ బాలికల కోసం స్నేహ సమ్మర్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. లైఫ్ స్కిల్స్, భద్రత, సైకిల్ ట్రైనింగ్ కార్యక్రమాలు చేపడుతామని.. ఈ కార్యక్రమాలను బాలికలంతా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క దిశానిర్దేశర చేశారు. త్వరలో మహిళా సంఘ సభ్యుల ఎడ్యుకేషన్ ప్రొఫైల్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మహిళల విద్యార్హతలను గుర్తించి ఉన్నత విద్య అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. శనివారం బీఆర్‌కే భవన్‌లో సెర్ప్ డైరెక్టర్లు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులతో మంత్రి సీతక్క సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళా సంఘ భవనాల నిర్మాణం, 'అమ్మకు అక్షరమాల', సెర్ప్ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. ప్రతి మహిళా అక్షరాస్యురాలిగా ఉండటమే తమ ప్రభుత్వ లక్ష్మని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. 5,239 గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణ పనులు ఊపందుకున్నాయని వెల్లడించారు. ఇప్పటికే కొన్ని వీఓ భవనాలు పూర్తి అయ్యాయని తెలిపారు. ఈ పనులను వేగవంతం చేస్తున్న అధికారులకు అభినందనలు తెలిపారు. వచ్చే ఏడాది మరో 5,000 వీఓ భవనాలను నిర్మిస్తామని చెప్పుకొచ్చారు. 'అమ్మకు అక్షరమాల' ద్వారా ఇప్పటివరకు 6.5 లక్షల మహిళలకు అక్షరజ్ఞానం కల్పించామని వెల్లడించారు. త్వరలో మరో 6.5 లక్షల మహిళలకు గ్రామాల్లోనే విద్యాబోధన కల్పిస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళా సంఘాలు.. బాల్య వివాహాల వంటి సామాజిక రుగ్మతల నిరోధంలో ముందుండాలని పిలుపునిచ్చారు.

## అస్వస్థకు గురైన గవర్నర్ నజీర్

మొదటి పేజీ తరువాయి
గవర్నర్ అబ్దుల్ నజీర్.. బెంగళూరు నుంచి విజయవాడకు రావాల్సి ఉండగా, ఆయన ప్రయాణిస్తున్న విమానం ఆలస్యమైంది. రాత్రి 12 గంటలకు చేరుకోవాల్సిన విమానం ఆలస్యంగా అర్ధరాత్రి 2 గంటల సమయంలో విజయవాడకు చేరుకుంది. అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో తెల్లవారుఝామున సుమారు 4:30 గంటలకు గవర్నర్‌కు కడుపులో నొప్పి ప్రారంభమైంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆయనను ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో గవర్నర్ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. వైద్య పరీక్షల అనంతరం మాణిపాల్ ఆసుపత్రి నుంచి తన నివాసానికి చేరుకున్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్.. జర్నీ ప్రభావం, అర్ధరాత్రి ఆలస్యం కావడం లాంటి చిన్న కారణాల వలన అస్వస్థతకు గురైనట్టుగా తెలుస్తోంది.. అయితే కిడ్నీలో రాళ్లు ఉన్నాయని, ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని ఆసుపత్రి వైద్యులు సూచించినట్లు తెలుస్తోంది. గవర్నర్ వైద్య పరీక్షల్లో కిడ్నీలో రాళ్లు ఉన్నట్లు గుర్తించిన వైద్యులు.. శస్త్రచికిత్స ద్వారా వాటిని తొలగించాలని సూచించారు. ఇవాళ ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నాయని చెప్పిన గవర్నర్.. మరోసారి ఆసుపత్రికి వస్తానని చెప్పి వెళ్లిపోయారు.విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లోక్ భవన్‌కు వెళ్లారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో సీఎం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. స్వల్ప అస్వస్థత కారణంగా గవర్నర్ ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన విషయం తెలిసి, లోక్ భవన్‌కు చేరుకున్న సీఎం.. గవర్నర్‌ను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గవర్నర్ త్వరగా కోలుకోవాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

## తండ్రి పిట్టల దొర.. బిడ్డ పిట్టల దొరసాని

మొదటి పేజీ తరువాయి
ఈ వ్యాఖ్యలపై ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం బీజేపీ మద్దతు లేకుండా వచ్చిందా? అంటూ కవితను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇండియా-పాకిస్తాన్ విభజన ప్రక్రియలో ఎంతో మంది చనిపోయారని వివరించారు. వీళ్లు ప్రకటించి వెనక్కి తీసుకున్నారు కాబట్టే.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అనేక మంది చనిపోయారని చెప్పారు. ఇదే విషయంపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో ప్రస్తావించారని పేర్కొన్నారు. తేజస్వి వ్యాఖ్యలను బీఆర్ఎస్ కళ్ళద్దాలతో చూడకండంటూ రాజకీయ పార్టీల నేతలకు ఆయన స్పష్టం చేశారు. అజారుద్దీన్ అదృష్టం బాగుందని.. అందువల్ల ఆయన మంత్రి అయ్యారన్నారు. గవర్నర్ తీసుకున్న నిర్ణయం వల్ల అజారుద్దీన్ ఎమ్మెల్సీ అయ్యారని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. పిట్టల దొర క్యారెక్టర్ కేసీఆర్ అయితే.. పిట్టల దొరసాని క్యారెక్టర్ కవితది అన్నారు. సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే ప్రజలు వాళ్లను ఓడించి బీజేపీని గెలిపించారన్నారు. ఆమెకు రాజకీయ సమాధి కట్టింది బీజేపీ అని చెప్పారు. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తుంది.. అనేది ప్రజలు ఆలోచించాలని పిలుపునిచ్చారు. 12 ఏళ్ల పాలనలో నరేంద్ర మోడీ అవినీతి రహిత పాలన అందించారని చెప్పారు.

## ఎపిలో పలు చోట్ల పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బారులు తీరిన వాహనదారులు

ఆంధ్రప్రదేశ్‌లో పలు జిల్లాల్లో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రరూపం దాల్చింది. ముఖ్యంగా ఎన్టీఆర్ జిల్లాతో పాటు మరికొన్ని జిల్లాల్లో అనేక పెట్రోల్ బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిచ్చాయి. దీంతో ఇంధనం కోసం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉందని సమాచారం. పలు పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు పూర్తిగా అయిపోవడంతో వాహనదారులు బంకుల వద్ద నిరాశగా వెనుదిరుగుతున్నారు. కొన్నిచోట్ల బంక్ సిబ్బందితో వాహనదారుల మధ్య వాగ్వాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా ఆయిల్ కంపెనీలు అప్పు ప్రతిపాదికన ఇంధన సరఫరాను నిలిపివేయడమేనని తెలుస్తోంది. పెండింగ్ బకాయిలు చెల్లించిన తర్వాతే సరఫరా పునరుద్ధరిస్తామని ఆయిల్ కంపెనీలు స్పష్టం చేసినట్లు సమాచారం. పాత బకాయిల చెల్లింపుల్లో జాప్యం కారణంగా ఈ సంక్షోభం ఏర్పడిందని తెలుస్తోంది. ఇక నష్టాలు, పరిశ్రమల్లో వినియోగం తగ్గుదల కూడా సరఫరాపై ప్రభావం చూపినట్లు చెబుతున్నారు. కొండపల్లి పారిశ్రామిక వాడ సమీపంలో భారీ సంఖ్యలో ట్యాంకర్లు నిలిచిపోయాయి. ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద వందల సంఖ్యలో ట్యాంకర్లు స్టాండ్‌స్టిల్‌లో ఉన్నట్లు సమాచారం. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు కూడా సరఫరా అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. దీంతో రవాణా, పరిశ్రమలు, వ్యవసాయం రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇంధన సంక్షోభంపై నిన్న విజయవాడలో సివిల్ సప్లైస్ అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, ఏపీ పెట్రోల్ డీలర్స్ అసోసియేషన్ సంయుక్త సమావేశం నిర్వహించారు. చర్చలు సఫలమయ్యాయని, నిరంతర సరఫరా కొనసాగుతుందని ఆయిల్ కంపెనీలు తెలిపినట్లు డీలర్స్ అసోసియేషన్ పేర్కొంది. అయితే సమావేశం తర్వాత కూడా పలు బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు కనిపిస్తుండటంతో ప్రజల్లో ఆందోళన కొనసాగుతోంది. సమస్యను వెంటనే పరిష్కరించి సాధారణ సరఫరా పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అటు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో డీజిల్ కొరత తీవ్రంగా కనిపిస్తోంది. పలు పెట్రోల్ బంకుల వద్ద డీజిల్ కోసం వినియోగదారులు, రైతులు, వాహనదారులు టిన్నులతో బారులు తీరుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనుల సీజన్‌లో ఈ కొరత రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం జిల్లాలో వరి పంట కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రైతులు వరి కోత యంత్రాల సహాయంతో పంట మాసూళ్లలో నిమగ్నమై ఉన్నారు. అయితే కోత యంత్రాలకు అవసరమైన డీజిల్ బంకుల్లో అందుబాటులో లేకపోవడంతో కోత పనులు అంతరాయం కలుగుతున్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని నేపథ్యంలో రైతులు పండించిన పంటను ఎలాగైనా కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

## పరీక్షల్లో ఫెయిల్ అవుతానన్న భయం విద్యార్థిని ఆత్మహత్య

పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమో అన్న భయంతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. మెదక్ జిల్లా కొత్తపల్లి తండాలో ఈ విషాద ఘటన జరిగింది.వివరాల్లోకి వెళ్తే.. కొత్తపల్లి తండాకు చెందిన బానోత్ సాయిప్రియ (16) స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఈ ఏడాది జరిగిన పరీక్షలకు హాజరైంది. అయితే పరీక్షలు అయిపోయినప్పటి నుంచి ఫెయిల్ అవుతానేమో అని సాయిప్రియకు భయం పట్టుకుంది. దీంతో పరీక్షల అనంతరం దిగులుగా ఉండేది. ఇది గమనించి తల్లి ఆమెకు ధైర్యం చెప్పింది. ఫెయిల్ అయిన ఫర్వాలేదని చెప్పింది. అయినప్పటికీ సాయిప్రియ టెన్షన్ పడుతూనే ఉంది. ఈ క్రమంలోనే శుక్రవారం కుటుంబసభ్యులు ఎవరూ ఇంట్లో లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఇది గమనించిన సాయిప్రియ సోదరుడు తల్లికి చెప్పాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## ఎపిఎస్ ఆర్టీసికి జాతీయ అవార్డు సాంకేతిక వినియోగంలో విశిష్ట గుర్తింపు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు మరో జాతీయ అవార్డ్ లభించింది. సాంకేతిక వినియోగంలో విశిష్ట ప్రతిభకు గుర్తింపుగా పీఎస్ఈ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్-2026 పురస్కారం దక్కింది. మెరుగైన ప్రజా రవాణా సహా డిజిటల్ సేవల్లో ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నందుకు గానూ ఈ అరుదైన గౌరవం పొందింది ఏపీఎస్ఆర్టీసీ. హైదరాబాద్‌లో జరిగిన
ఇండియా పీఎస్ఈ సమ్మిట్‌లో ఈ అవార్డును సొంతం చేసుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా సాంకేతికతను వినియోగిస్తూ, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నందుకు ఈ జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఈ అవార్డు సాధనలో కీలక పాత్ర పోషించిన ఏపీఎస్ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు సహా ఇతర అధికారులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభినందించారు. ఏపీఎస్ఆర్టీసీ ఇప్పటికే డిజిటల్ టికెటింగ్, కార్గో సేవల్లో జాతీయ స్థాయి గుర్తింపు పొందింది. ఇది ఆర్టీసీ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి అని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఃూగా.. ఈ ఏడాది జనవరి 16న గవర్నెన్స్ నౌ - 6వ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ ప్రదానోత్సవంలోనూ జాతీయ పురస్కారం పొందింది ఏపీఎస్ఆర్టీసీ. రాష్ట్ర వ్యాప్తంగా బస్టాండ్లలో ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్‌ను విజయవంతంగా అమలు చేయడం ద్వారా ప్రయాణికులకు డిజిటల్ సేవలను అందించినందుకు గానూ అవార్డ్ దక్కింది. ఢిల్లీలో నాడు జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చీఫ్ ఇంజినీర్(ఐటీ) వై.శ్రీనివాసరావు పురస్కారాన్ని అందుకున్నారు.

## అబద్దాల ప్రచారంలో సజ్జల దిట్ట

- జగన్ హయాంలో రైతులు ఆత్మహత్యలు
- నేడు వ్యవసాయానని పండగచేసి చూపుతున్నాం
- సజ్జల వ్యాఖ్యలపై మండిపడ్డ అచ్చన్నాయుడు

అబద్దాలు ప్రచారం చేయడంలో వైసిఇ నేత సజ్జలకు ఉన్న ప్రావీణ్యం దేశంలో ఎవరికీ లేదని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అచ్చెన్నాయుడు ట్వీట్ పెట్టారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో అప్పుల భారంతో రైతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని ధ్వజమెత్తారు. నేడు కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగలా మారుస్తోందని వ్యాఖ్యానించారు. తమ గణాంకాలు ప్రస్తావించామని.. దమ్ముంటే సమాధానం చెప్పాలని సజ్జలకు సవాల్ చేశారు. వైసీపీ వైఫల్యం వల్ల 2023-24లో 143 లక్షల మెట్రిక్ టన్నులకు ఆహార ధాన్యాల ఉత్పత్తి పడిపోయిందని అచ్చెన్నాయుడు తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 237 లక్షల టన్నులకు పెంచి 51శాతం వృద్ధిని నమోదు చేసిందని ప్రస్తావించారు. ధరల స్థిరీకరణ నిధి కింద కేటాయింపులు పెంచి, సుమారు రూ.588 కోట్లతో పొగాకు, మామిడి, ఉల్లి, కోకో రైతులకు నేరుగా లబ్ధి చేకూర్చామని వివరించారు. ఉల్లి రైతులకు గతంలో ఉన్న రూ.25 వేల నష్టపరిహారాన్ని హెక్టారుకు రూ.50 వేలకు పెంచి ఆదుకున్న ఘనత తమ కూటమి ప్రభుత్వానిదేనని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం మొక్కజొన్న సమస్యపై కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో నిరంతరం చర్చిస్తూ రైతులకు అనుకూల నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నామని అచ్చెన్నాయుడు వెల్లడించారు. మైక్రో ఇరిగేషన్‌లో ఏపీని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టామని చెప్పారు. వైసీపీ హయాంలో నిర్లక్ష్యంగా వదిలేసిన రూ.881 కోట్ల డ్రిప్, స్ప్రింక్లర్ బకాయిలను కూడా తామే చెల్లించామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ మేరకు రాయలసీమను గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని వ్యాఖ్యానించారు. ఆయిల్ పామ్ సాగులో ఏపీని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపి, ఉ÷ఎంను రూ.1.52 లక్షల కోట్లకు చేర్చామని వెల్లడించారు. వాస్తవాలు ఇలా ఉంటే, ఇంకా అబద్దాలతో రైతులను మోసం చేయాలని చూస్తే ప్రజలే వైసీపీ నేతలకు తగిన బుద్ధి చెబుతారని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం ఏప్రిల్ 26, 2026

# మెట్టుపల్లి లో హిందూ సమ్మేళనం ఏర్పాట్లు

**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్టుపల్లిలోని ఆజాద్ నగర్ – రాణా ప్రతాప్ బస్తీ లో హిందూ సమ్మేళనం ఏర్పాట్లు ప్రస్తుతం అత్యంత ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈ సమ్మేళనానికి సంబంధించిన క్షేత్రస్థాయి పరిశీలనలు మరియు సన్నాహక సమావేశాలు జరుగుతున్నాయి.

» ఏర్పాట్ల పరిశీలన

సమ్మేళనం నిర్వహించే ప్రాంగణంలో జరుగుతున్న పనులను స్థానిక నాయకులు మరియు నిర్వాహకులు నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.

» ప్రధాన లక్ష్యం



హిందూ సమాజంలో సామాజిక సమరసత, ఐక్యత పెంపొందించడం మరియు సనాతన ధర్మ విలువల పట్ల అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం.

**» ఈ నెల 28 న జరిగే ఆజాద్ రాణా ప్రతాప్ బస్తి హిందూ సమ్మేళనం సందర్భంగా డాక్టర్ అమరేశ్వర్, డాక్టర్ గంగాసాగర్ ఆర్ఎస్ఎస్ ప్రముఖులచే కరపత్రం ఆవిష్కరించారు**

బస్తీలోని ప్రతి ఇంటికీ ఆహ్వాన పత్రికలు అందజేస్తూ, కాషాయ జెండాలతో వీధులను అలంకరిస్తున్నారు.

**» ఈ సమ్మేళనంలో ధర్మ ప్రవచనాలతో పాటు, భక్తి సంగీతం మరియు యువతను ఆకట్టుకునేలా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేలా ప్రణాళిక చేసారు**

# కరాటేలో సరికొత్త చరిత్రకు సిద్ధమైన రణవీర్ టేక్వాండో అకాడమీ

కరపత్రం ప్రతినిధి దిన పత్రిక మల్కాజిగిరి మండల





మార్షల్ ఆర్ట్స్ రంగంలో హైదరాబాద్ లో జయంత్ రెడ్డి ఇంటర్నేషనల్ టైక్వాండో అకాడమీ ఆద్వర్యం లో అతిపెద్ద కరాటే ప్రదర్శన కాటగారీ లో గినెస్ వరల్డ్ రికార్డ్ సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కౌకూర్ రణవీర్ తైక్వాండో అకాడమీ ఈ అరుదైన ఘనతలో భాగస్వామి కానుంది.
మాస్టర్ రమేష్ పర్యవేక్షణలో రణవీర్ మరియు శ్రేయాస్ ఈ ప్రతిష్టాత్మక లార్జెస్ట్ కరాటే డిస్ప్లే గిన్నీస్ వరల్డ్ రికార్డ్ ప్రయత్నంలో పాల్గొంటున్నారు. ఈ నెల 26వ తేదీన గచ్చిబౌలి స్టేడియం వేదికగా 20 నిమిషాల పాటు నిరంతర కరాటే ప్రదర్శన జరగనుంది. ఈ చారిత్రాత్మక ప్రదర్శనలో రణవీర్ మరియు శ్రేయాస్ తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి రికార్డు నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించనున్నారు.
భారతీయ మార్షల్ ఆర్ట్స్ ప్రతిభను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడమే మా లక్ష్యమని, మా విద్యార్థులు ఈ గిన్నీస్ రికార్డ్ ప్రయత్నంలో పాల్గొనడం గర్వకారణమని మాస్టర్ రమేష్ తెలిపారు. 6 ఏళ్ల చిన్నారి నుండి 60 ఏళ్ల వృద్ధుల వరకు సుమారు 2000 మంది పాల్గొంటున్న ఈ మెగా ఈవెంట్‌లో, కౌకూర్ అకాడమీ క్రీడాకారులు తమ ప్రత్యేకతను చాటుకునేందుకు సిద్ధమయ్యారు. గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధుల సమక్షంలో జరిగే ఈ ప్రదర్శన అనంతరం రికార్డును ధృవీకరించి సర్టిఫికేట్‌ను అందజేస్తారు.

# రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యునిగా రమేష్ గౌడ్ ఎన్నిక

కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి



సంగారెడ్డి జిల్లా కేంద్రంలో శనివారం నూతనంగా ఎన్నికైన రైతు సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మూడవ మాసభలు ఈనెల 23 24 25 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ యొక్క మహాసభలలో సంగారెడ్డి జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జయరాజు ,జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర మహాసభలలో రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజులలో రైతుల సంక్షేమం కోసం, కౌలుదారుల సమస్యలపై, పోరాటాలు నిర్వహించి. రైతులందరికీ అండగా ఉంటామని ఆయన తెలిపారు.

# రామగుండం బీఆర్ఎస్ నాయకులకు ప్రత్యేక ఆహ్వానం - – ఆలయ వార్షికోత్సవ వేడుకలు

కరపత్రం ప్రతినిధి రామగుండం ఏప్రిల్ 25



రామగుండం నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులకు విజ్ఞప్తి. ఈ నెల 26-04-2026 గురువారం రోజున జవహర్ లాల్ స్టేడియం సమీపంలోని శ్రీ జయదుర్గా దేవి దేవాలయంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ దేవాలయాన్ని శ్రీ కొప్పుల ఈశ్వర్ -- స్నేహలత దంపతులు నిర్మించారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు చండీ హోమం, మధ్యాహ్నం 1 గంటకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచనల మేరకు ఈ కార్యక్రమానికి మీ అందరినీ ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు. కాబట్టి రామగుండం నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, సహకార సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ డివిజన్ మరియు గ్రామ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరుతున్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ పట్టణ మరియు మండల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, మీడియా మిత్రులు, కార్యకర్తలు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నారు. కోరుకంటి చందర్మాజీ ఎమ్మెల్యేపెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రామగుండం నియోజకవర్గ ఇంచార్జ్

# వీణవంక పున్నమి జాతర బ్రహ్మోత్సవాలకు ఊపు --

**▪ ఉదయ్ నందన్ రెడ్డి విరాళం, ఆలయ అభివృద్ధికి కృషి**

కరపత్రం ప్రతినిధి వీణవంక ఏప్రిల్ 25



కరీంనగర్ జిల్లా వీణవంక గ్రామంలో వెయ్యిండ్ల చరిత్ర కలిగిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వీణవంక పున్నమి జాతర బ్రహ్మోత్సవాలు ఈ సంవత్సరం కూడా వైభవంగా జరగనున్నాయి. ఈ పవిత్ర బ్రహ్మోత్సవాల నిర్వహణకు స్వగ్రామం వీణవంకకు చెందిన యూప్ టీవీ సీఈఓ ఉదయ్ నందన్ రెడ్డి, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నప్పటికీ తమ స్వగ్రామ దైవాన్ని మరువకుండా తన అనుచరుల ద్వారా ?50,000/- (యాభై వేల రూపాయలు) విరాళాన్ని ఆలయ అర్చకులు సతీష్ శర్మకు అందజేశారు. అంతేకాకుండా, దీర్ఘకాలంగా శిథిలావస్థలో ఉన్న ఆలయ కోనేరు పునరుద్ధరణ కోసం తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌తో స్వయంగా మాట్లాడి నిధుల మంజూరు కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. ఆలయ పునరుద్ధరణ దిశగా ఆయన వేస్తున్న ప్రతి అడుగు గ్రామస్తుల్లో ఆనందాన్ని నింపుతోంది. నేటి ఆధునిక యుగంలో చాలామంది తమ మూలాలను మరచిపోతున్న తరుణంలో, ఉదయ్ నందన్ రెడ్డి మన పూర్వీకుల ఆచారాలు, దేవాలయాల సంరక్షణ, సంస్కృతి సంప్రదాయాలను పునర్జీవింపజేసే దిశగా అర్థవంతమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులందరూ స్వామి సేవలో భాగస్వాములై వెయ్యిండ్ల చరిత్ర కలిగిన బ్రహ్మోత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందించాలని ఉదయ్ నందన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీణవంక మాజీ జడ్పీటీసీ దసారపు ప్రభాకర్, ఆలయ పూజారి సతీష్ శర్మ, సముద్రాల బిక్షపతి, సమీడ్ల చిట్టి, తాళ్లపెల్లి కుమారస్వామి, వేణు తిరుపతి, మల్లయ్య, దాసారపు వంశీకృష్ణ, తోట్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు హనుమాన్ గారికి నరేందర్ రెడ్డి

కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 25



మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ గార్డెన్ నర్సాపూర్ లో జరిగిన కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ చేసినమెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు హనుమన్న గారి నరేందర్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం అఖిలపక్ష పార్టీ నాయకులు పోరాడితేనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందని అలాంటి తెలంగాణ రాష్ట్రాన్ని 10 సంవత్సరాలు గత బి.ఆర్ ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల పాలనలో తెలంగాణ రాష్ట్ర ప్రజల మనోభావాలను భంగపరుచుకుంటూనే బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్వార్థ పర రాజకీయం చేసుకుంటూ అక్రమ ఆశ్రమం సంపాదించుకోవడం కోసమే 10 సంవత్సరాల పాలనలో ఎనలేని కోట్ల ఆస్తులు సంపాదించుకున్నారే తప్ప తెలంగాణ రాష్ట్ర నిరుపేద ప్రజల కోసం ఏనాడు ఆలోచించకుండా వారి పరిపాలన సాగించారు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత మూడవసారి జరిగినటువంటి అసెంబ్లీ ఎన్నికలలో మళ్లీ ఇందిరమ్మ పరిపాలన రావాలని ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రజలని తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయితే ఎన్నో అభివృద్ధి పనులు చేస్తాము అని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్నటువంటి అభివృద్ధి పనులను చూసి ప్రతిపక్ష పార్టీ నాయకులు ఓర్వలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం పై లేని పోనీ ఆరోపణలను చేస్తున్నారే తప్ప గత పది సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రాన్ని ఏలిన బి ఆర్ ఎస్ ప్రభుత్వ మాజీ ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయితే దళితుల్ని ముఖ్యమంత్రిగా చేస్తాను అని చెప్పిన తాను మాటపై నిలబడకపోవడంతో తానే తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలను తీసుకోవడమే కాకుండా ద్వితీయంగా మళ్ళీ జరిగిన తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలలో నిలబడి గెలిచి రెండవసారి ముఖ్యమంత్రి కూడా తానే పదవిలను ఆశించి మళ్లీ రెండవసారి ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టి తన నీతి నిజాయితీని నిరూపించుకోలేని తాను మళ్ళీ రానున్న రోజుల్లో బిఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుంది అని చెప్పడంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అర్థం అవుతుంది పది సంవత్సరాల పరిపాలనను ప్రజల గోడు నిరుపేదల కు రెండు పడకల గదులను ఇస్తామని వాగ్దానం చేయడమే కాకుండా చెప్పిన వాగ్దానాన్ని చెవిన పెట్టుకోకుండా కుటుంబ పరిపాలనని సాగించారని తెలంగాణ రాష్ట్రంలో మూడవసారి జరిగినటువంటి అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో ఇందిరమ్మ ఇండ్లు నిరుపేదలకు ఇండ్లు ఇవ్వడంతో చూసి ఓర్వలేని బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఎంతగానో అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై లేని పోనీ ఆరోపణలను మానుకోవాలని పత్రిక ముఖంగా తెలియజేయడం జరుగుతుందని వారు తెలియజేశారు ఇకనైనా ప్రభుత్వాలు మారిన రాష్ట్ర ప్రజల రాతలు మారడం లేదని ప్రజల రాతలు మార్చిన ప్రభుత్వం కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీకి దక్కిందని వారు తెలియజేశారు రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బి ఆర్ ఎస్ పార్టీ నామరూపాలు లేకుండా అవ్వడానికి తెలంగాణ రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని వారు ఆరోపణ చేశారు నిరుపేదలకు ఇల్లు లేని వారికి మునుముందు విడతలుగా ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముందు ఉంటుందని ఇందిరమ్మ ఇల్లు రాని వారు ఎటువంటి ఆలోచనలు పెట్టుకోకుండా తమకు విడుదలుగా ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఎటువంటి ఆలోచనలు పెట్టుకోకుండా వెనుక ముందు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా రాని వారికి కూడా ఇవ్వడం జరుగుతుందని వారు తెలియజేశారు

# పెట్రో కొరతపై సిఎం అత్యవసర సమీక్ష

**- తక్షణం సమస్యను పరిష్కరించాలని ఆదేశం**
**- పెట్రో డీలర్లతో మాట్లాడిన అధికారులు**

రాష్ట్రంలో ఇంధన కొరతతో పలు చోట్ల పెట్రోల్ బంకుల మూసివేత అంశంపై అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం సమీక్ష నిర్వహించారు. పలు జిల్లాల్లో పరిస్థితులు, వాహనదారులు, రైతుల ఇబ్బందులపై అధికారులతో సీఎం మాట్లాడారు. సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎస్ సాయిప్రసాద్, పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుని ప్రజలకు ఇబ్బంది రాకుండా చూడాలని ఆదేశించారు. పెట్రోల్ బంకుల యజమానులు, ఆయిల్ కంపెనీలతో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. సీఎం ఆదేశాలతో వెంటనే స్పందించిన అధికారులు.. ఇంధన సరఫరాపై పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్‌తో ఫోన్‌లో చర్చలు జరిపారు. తక్షణం స్టాక్ లేని బంకుల వివరాలు అందించాలని అధికారులు ఆదేశించారు. దీంతో జిల్లాల అధ్యక్షులకు రాష్ట్ర డీలర్ల అసోసియేషన్ సమాచారం పంపించింది. స్టాక్ సమస్య ఉంటే తక్షణం టోల్‌ఫ్రీ నం.1967కు కాల్ చేయాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ సూచించారు.

# జమ్మికుంట బొమ్మల గుడిలో హిందూ సమ్మేళనం ఘనంగా
## గోపూజలో మున్సిపల్ చైర్మన్ పాల్గొన్నారు

కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 25





జమ్మికుంట పట్టణ పరిధిలోని శ్రీ విశ్వేశ్వర స్వామి దేవాలయం (బొమ్మల గుడి) ఆవరణంలో నిర్వహించిన హిందూ సమ్మేళనం, గోపూజ కార్యక్రమం భక్తి వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట పట్టణం హిందూ బంధువులతో కళకళలాడుతుందని పేర్కొన్నారు. శ్రీరామ భక్త ఆంజనేయ స్వామి మాలదారులు మరియు ఇతర హిందూ బంధువులు కలిసి భక్తి గీతాలను ఆలపిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. ప్రస్తుత యువత చెడు వ్యసనాలు, చెడు మార్గాల వైపు వెళ్లకుండా ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించాలని, భక్తి శ్రద్ధలతో భగవంతుణ్ణి ఆరాధిస్తూ కుటుంబ సభ్యులను, పెద్దలను గౌరవించే విధంగా జీవించాలని సూచించారు. అలాగే ఈ కార్యక్రమానికి హాజరైన హిందూ బంధువులకు, పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలకు భగవంతుని కృపకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చందా రాజు, శీలం శ్రీనివాస్, మాచర్ల రాజు, లక్ష్మణ్, వేణు, స్వామి సురేష్ ఆత్మరావ్ మహారాజ్, అధ్యక్షులు పాకాల రవీందర్ రెడ్డి, కరీంనగర్ విభాగ్ భౌతిక్ ప్రముఖులు సామల కిరణ్, సామాజిక సమరసిక వివేకానంద కేంద్ర కార్యకర్త గుండా సుధాశ్రీ, దావులూరు మురళి, గందె రఘు, యమసాని సురేష్, దాసరి రవీందర్, సందిరి సారంగపాణి, ఎక్కడి రఘోతం రెడ్డి, ఆవాల రాజారెడ్డి తదితరులు మరియు హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక

ఆదివారం ఏప్రిల్ 26, 2026

## బొంగొని రాజేందర్ ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్

కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 25



జమ్మికుంట పట్టణ పరిధిలోని వర్తక సంఘం పరిసర ప్రాంతానికి చెందిన బొంగొని రాజేందర్ మరణించి ఏడాది పూర్తైన సందర్భంగా నిర్వహించిన ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఆయన, రాజేందర్‌తో ఉన్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. ఆయన ఎక్కడ ఉన్నా వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. సమాజంలో ఆయన చేసిన సేవలు, మంచి పేరు చిరస్థాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చందా రాజు, చింతల శ్రీనివాస్, దిడ్డి రాము ఇతరులు పాల్గొని రాజేందర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు.

## దళితరత్న అవార్డుల ప్రధానోత్సవం ఘనంగా నిర్వహణకు ఆహ్వానం

కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 25



మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర, జిల్లా నాయకులు, అనుబంధ సంఘాల ముఖ్య నాయకత్వానికి హృదయపూర్వక ఉద్యమ నమస్కారాలు.ఏప్రిల్ 30వ తేదీ గురువారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్ నగరంలోని రవీంద్ర భారతిలో "మహనీయుల జయంతి ఉత్సవాలు మరియు దళితరత్న అవార్డుల ప్రధానోత్సవం" కార్యక్రమం వైభవంగా నిర్వహించబడుతుంది.డాక్టర్ బాబు జగజీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో, మాదిగ హక్కుల దండోరా మరియు దళిత బహుజన సంఘాల సమన్వయంతో ఈ కార్యక్రమం జరగనుంది. ఇందులో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు అతిథులుగా పాల్గొననున్నారు.కాబట్టి ఈ మహోత్సవానికి రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు, సంఘాల ప్రతినిధులు తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి. కవ్వంపల్లి రవి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

## చిన్నారుల భవిష్యత్తు పునాది అంగన్వాడి..

కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 25:



రామగుండం ప్రాజెక్టు పరిధిలోని జవహర్ నగర్ సెక్టార్ లో 9 అంగన్వాడి సెంటర్స్ లోని శనివారం పూర్వ ప్రాథమిక విద్య అభ్యసించినటువంటి ప్రీస్కూల్ పిల్లలకు గ్రాజువేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎండీ ముస్తఫా, పాతి పెల్లి కావ్య, దొంత శ్రీనివాస్, కారంగుల రమ్య గార్లు మాట్లాడుతూ... చిన్నారుల భవిష్యత్తు పునాది అంగన్వాడి దశలోనే నిర్మితమవుతుంది. ఇలాంటి స్కూల్ రెడీనెస్ మేళల ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, విద్యపై ఆసక్తి మరింతగా పెంపొందుతుందని" తెలిపారు. ప్రభుత్వం మరియు స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేస్తే పిల్లల అభివృద్ధి మరింత మెరుగ్గా సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. రామగుండం మున్సిపల్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల సేవలను అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ అలేఖ్య పటేల్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య క్రమబద్ధీకరంగా నడుస్తుందని పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ దశలో వారికి (పిల్లలకు) అవసరమైనటువంటి అంశాలను అంగన్వాడి కేంద్రాలు బోధిస్తూ వారి యొక్క సామాజిక అభివృధికి, శారీరక అభివృద్ధి, మానసిక అభివృద్ధి, భాషాభివృద్ధి భాష, మేదో అభివృద్ధి, సాంఘిక రసాస్వాధనాభి వృద్ధి పెంపొందించడానికి అంగన్వాడీలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.

## నర్సాపూర్ నియోజకవర్గ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కి స్వాగతం పలికిన నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి

కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ప్రిల్ 25



మెదక్ జిల్లానర్సాపూర్ నియోజకవర్గంలో జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి కి నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీ వాసవి మాత కనక పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో మంత్రివర్యులు పాల్గొన్నారు.అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని 5వ 6వ వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని లబ్ధిదారులను అభినందించారు.తదుపరి నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నగర అభివృద్ధి పథకం కింద రూ.15 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు మంత్రివర్యులు శంకుస్థాపన చేశారు. అలాగే నర్సాపూర్ మండలం నారాయణపూర్ గ్రామంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "బడిబాట" కార్యక్రమంలో పాల్గొన్నారు.ఇక నర్సాపూర్ లోని శ్రీ సాయి కృష్ణా గార్డెన్స్ లో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణ్ లక్ష్మి షాది ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసినీ రెడ్డి , స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## అబ్బోజు రాంబాబు కుటుంబానికి అండగా నిలిచిన వ్యాళ్ళ హరీష్ రెడ్డి

– చివరి సంవత్సరం కాలేజీ ఫీజు చెక్ ను అందజేసిన కేటీఆర్

– హరీష్ రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడిన కేటీఆర్

కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 25:



రామగుండం నియోజకవర్గంకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు తెలంగాణ ఉద్యమం సమయంలో చురుగ్గా పార్టీ తరఫున ప్రతి కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యమకారుడు అబ్బోజు రాంబాబు గతంలో రోడ్డు ప్రమాదానికి గురై మరణించారు. అయితే అప్పటినుండి కుటుంబ పెద్దను కోల్పోయి వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతూ జీవనాన్ని కొనసాగిస్తున్నారూ.. అదే సమయంలో అప్పటి ప్రజాప్రతినిధులు అబ్బోజు రాంబాబు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగాన్ని కల్పిస్తామని హామీ కూడా ఇచ్చారు కానీ అది ఇప్పటివరకు నెరవేరలేదు. అయితే వారి కుటుంబ పరిస్థితులు తెలుసుకున్న వ్యాళ్ళ హరీష్ రెడ్డి తప్పకుండా బిఆర్ఎస్ పార్టీ తరఫున వారికి వారి సొంత వీహెచ్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఆ కుటుంబానికి సహాయాన్ని అందించాల్సిందిగా నిర్ణయించుకున్నారు, అబ్బోజు రాంబాబు కుమారుడు కష్టపడి చదివి చెన్నైలోని బిట్స్ పిలాని లో సీటు సంపాదించి తన ఇంజనీరింగ్ ని కొనసాగిస్తున్నాడు, వారి ఆర్థిక పరిస్థితి తెలిసి హరీష్ రెడ్డి వారి ఫౌండేషన్ ద్వారా ప్రతి సంవత్సరం కాలేజీ ఫీజు నిమిత్తం రూ.30 వేల రూపాయలను అందించాలని నిర్ణయించుకున్నారు. అదేవిధంగా గడిచిన మూడు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఆ మొత్తాన్ని విద్యార్థికి అందిస్తున్నారు. అదేవిధంగా ఈ సంవత్సరం కూడా చివరి సంవత్సరం ఫీజును అందించాల్సి ఉండగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా ఆ విద్యార్థికి ఈ నాలుగవ సంవత్సరం కాలేజీ ఫీజు చెక్కును హరీష్ రెడ్డి కేటీఆర్ చేతుల మీదుగా అందించారు. విద్యార్థి శ్రీరామ్ ను ఉద్దేశిస్తూ కేటీఆర్ స్పందించారు ఎంతోమంది ఉద్యమకారులకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని భవిష్యత్తులో మంచి ఉద్యోగంలో స్థిరపడి కుటుంబాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని, ఎలాంటి అవసరం ఉన్న పార్టీ పరంగా పూర్తి సహకారం ఉంటుందని, నియోజకవర్గంలో భవిష్యత్తులో ఏలాంటి అవసరం ఉన్న వ్యాల్ల హరీష్ రెడ్డిని సంప్రదించాలని వారు తెలిపారు. ఈ సందర్భంగా అబ్బోజు శ్రీరామ్ స్పందిస్తూ ఉద్యమ సమయంలో ఎంతో కష్టపడి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తన తండ్రినీ తలుచుకొన్నాడు తన తండ్రి భౌతికంగా మాకు దూరమైన బిఆర్ఎస్ పార్టీ అండగా నిలిచిందని ఇంతటి గొప్ప సాయాన్ని చేసి అండగా నిలిచిన వ్యాల హరీష్ రెడ్డి నీ, అలాగే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కెసిఆర్ ని ఎప్పటికీ మర్చిపోలేమనీ మా ఊపిరి ఉన్నంతవరకు పార్టీకి మా వంతుగా సహకారాన్ని అందిస్తామని, అదేవిధంగా రామగుండం నియోజవర్గ ప్రజలందరికీ తరఫున గతంలో పార్టీకి ఎంతో పనిచేసిన ఉద్యమకారుల అందరి తరఫున కన్నీటితో హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని వారు తెలిపారు.

## ఫీజు రీయింబర్స్మెంట్ పథకం ఎత్తివేతకు ప్రభుత్వ కుట్రకు అనగా

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కలెక్టరేట్ ముందు నిరాహార దీక్ష

కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 25



కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న పది వేలకుపైగా ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ప్రధాన గేటు ముందు నిరాహార దీక్ష నిర్వహించారు.పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విషయంపై ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించగా, ప్రభుత్వం పదేపదే కోరినా సమాధానం ఇవ్వకపోవడంతో విద్యార్థుల నుంచే ఫీజులు వసూలు చేసుకోవచ్చని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. ఇది పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నంలో భాగమేనని విమర్శించారు.

ఈ పథకం ద్వారా లక్షలాది మంది పేద విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, న్యాయశాస్త్రం వంటి కోర్సులు పూర్తి చేసి దేశ విదేశాల్లో స్థిరపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందకుండా పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు ఈ పథకంపై ఆధారపడి చదువుకుంటున్నారని, ప్రవేశ సమయంలో ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తుందని నమ్మకంతోనే అడ్మిషన్ తీసుకుంటారని చెప్పారు. అయితే ప్రస్తుతం బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు.విద్యపై పెట్టే ఖర్చు దేశ అభివృద్ధికి మానవ వనరుల రూపంలో తిరిగి వస్తుందని, ఇది ఉచిత పథకం కాదని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా ఇప్పుడు వ్యవహరిస్తున్న ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటోందని విమర్శించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, సమాజం మొత్తం ఈ అంశంపై స్పందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఫామ్ ఆయిల్ పంట సాగు గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన గుండ్లపల్లి సర్పంచ్ మమత నరసింహ యాదవ్

కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 25





మెదక్ జిల్లా శివంపేట మండలం గుండ్లపల్లి గ్రామ సర్పంచ్ మమత నరసింహ యాదవ్ ఫామ్ ఆయిల్ పంట వలన ఎలాంటి లాభాలు వస్తాయో అని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించమని తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ వ్యవసాయ సంస్థ కృషి విజ్ఞాన్ వ్యవసాయ మెదక్ ఆర్టికల్చర్ ఆఫీసర్ మహేశ్వరి వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాస్ గౌడ్ పామాయిల్ ఫీల్డ్ ఆఫీసర్ అజయ్ అగ్రికల్చర్ డిపార్మెంట్ గోవింద్ లను తమ గ్రామ గుండ్లపల్లి మా గ్రామానికి పిలిపించి రైతులతో అవగాహన కార్యక్రమ సమావేశం ఏర్పాటు చేసి భూమి పరీక్ష గురించి పంటల సాగు గురించి డ్రిప్ గురించి కూరగాయలకు వచ్చే సబ్సిడీల గురించి పామ్ ఆయిల్ సాగు గురించి అవగాహన వచ్చే విధంగా రైతులకు తెలపడం జరిగిందని తెలియజేశారు అనంతరం రైతులు మాట్లాడుతూ రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసిన సర్పంచ్ మమత నరసింహ యాదవ్ కు గ్రామస్తులు అందరూ కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమం పై గ్రామ ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేశారు ఈకార్యక్రమంలో సర్పంచ్ పెంజర్ల మమత నరసింహా యాదవ్ ఉప సర్పంచ్ మస్కూరి సత్యనారాయణ ఉప్పునూతల దత్తాత్రేయ బొల్ల సదా ఉప్పునూతల సత్యనారాయణ మస్కూరి కుమార్ పెంజర్ల మహేష్ యాదవ్ పంచ మల్లారెడ్డి బోళ్ల పాపయ్య బోలా శంకర్ మస్కూరి స్వామి బజారి లక్ష్మారెడ్డి బజారి యాదిరెడ్డి యాద గౌడ్ నక్కలపల్లి మహేష్ సాకలి విట్టల్ పెంజర్ల ఆనంద్ యాదవ్ పెద్ద ఎత్తున గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా కడిగిన ముత్యం మా అధినేత కేసీఆర్

-కాళేశ్వరం ప్రాజెక్ట్ పై ఘోష్ కమీషన్ వేసిన తప్పుడు నివేదికను కొట్టివేసిన హైకోర్టు

-స్వాగతించిన బి ఆర్ ఎస్ నాయకులు

-ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వం కు చెంప పెట్టు

-బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నారాయణ, లింగా గౌడ్

కరపత్రం ప్రతినిధి అందోలు





అందోలు మండలంలోని మాసన్ పల్లి గ్రామంలో శనివారం. బి ఆర్ ఎస్, నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో. ఆ పార్టీ నేతలు పి. నారాయణ, ఎల్. లింగా గౌడ్, శంకరయ్యలు మాట్లాడుతూ.. ముందుచూపు ఆలోచనతో నాటి సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలం కావాలన్నా ఉద్దేశంతో అద్భుతంగా కాళేశ్వరం ప్రాజెక్టుని నిర్మించారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు జరగాయంటూ ఆరోపణలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేయడం జరిగిందని అన్నారు, దాన్ని హైకోర్టు కొట్టివేయడంతో న్యాయం, ధర్మం గెలిచిందని అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు జరగాయంటూ తప్పుడు నివేదికలతో కేసీఆర్ పై నిందలు వేశారని బీఆర్ఎస్ నాయకులు అరోపించారు. కాళేశ్వరం పై ఘోష్ కమిషన్ ను వేసి తప్పుడు నివేదికలతో హైకోర్టులో పిటిషన్ వేయడం జరిగిందన్నారు. దానిని హైకోర్టు కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంప దెబ్బ లాంటిదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మాసన్ పల్లి గ్రామ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌పై ఉక్కుపాదం

– ఈగిల్‌లో డేటా సెంటర్ ఏర్పాటు – ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు అతి త్వరలో ఈగల్‌లో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వెల్లడించారు. శనివారం మంగళగిరిలో ఈగల్ హెడ్ క్వార్టర్స్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. ఏడాదిన్నర క్రితం ఈగల్ వింగ్‌ను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశామన్నారు. పని తీరుతో ఈగల్‌కు దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని తెలిపారు. ఈగల్‌ను ప్రీమియర్ ఆర్గనైజేషన్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. గంజాయి పెంపకం, ఉత్పత్తిను నిరోధించేందుకు.. అలాగే ఎన్‌డీపీఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్) అమలు చేయడంలో ఈగల్ ముందుందని వివరించారు. గతంలో ఆక్టోపస్, గ్రేహౌండ్స్ తరహాలోనే ఈగల్ కూడా బాగా రాణిస్తుందని ఈ సందర్భంగా ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గంజాయి సాగు జీరో చేయగలిగారని చెప్పారు. భవిష్యత్తులో ఈగల్ టీం మరింత యాక్టివ్‌గా పని చేస్తుందని పేర్కొన్నారు. డ్రోన్లు, శాటిలైట్లతో గంజాయి నిర్మూలన చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం గంజాయి, డ్రగ్స్ వినియోగించే వారిపై ఫోకస్ పెడుతున్నామని ఏపీ డీజీపీ తెలిపారు. ఆ క్రమంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నా మన్నారు. డ్రగ్స్, గంజాయిని ఎవరు వినియోగిస్తున్నారు? ఎందుకు వినియోగిస్తున్నారనే కోణంపై దృష్టి సారించామని పేర్కొన్నారు. మొదటి దశలో 10 వేల టెస్టింగ్ కిట్స్ వినియోగించామన్నారు. అలాగే డ్రగ్స్ వినియోగించే వారు.. పేమెంట్స్ ఎలా చేస్తున్నారు? ఎక్కడ నుంచి వాటిని తీసుకు వస్తున్నారు? అనే విషయాలను కూడా పరిశీలిస్తున్నామని ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వివరించారు.